

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

● కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా జరపాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు కొనుగోళ్లు జరపాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల వసతులను కేంద్రాల్లో ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు మిల్లుకు వచ్చిన లారీలను త్వరితగతిన దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలతో లేకపోతే సంబంధిత పౌర సరఫరా క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ పౌరసరఫరా సంస్థ జితేంద్రప్రసాద్, జిల్లా రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లర్ అసోసియేషన్ నాయకులు నవీన్, మైలారపు రాంబాబు, మల్లారెడ్డి, ఇతర రైస్ మిల్లర్లు పాల్గొన్నారు

'పెన్షనర్ల బకాయిలు చెల్లించాలి'

జగిత్యాల అగ్రికల్చర్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన టీపీసీఏ జిల్లా స్థాయి సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు సభ్యత్వం ఇస్తూ వారిని సన్మానించారు. సమావేశంలో సంఘ బాధ్యులు హన్మంతరెడ్డి, విశ్వనాథం, ప్రకాష్‌రావు, యాకూబ్, గంగాధర్, విఠల్, శివానందం, గంగాధర్, మురళి, వేణుగోపాల్ రావు, మధుసూధన్‌రావు, వీరారెడ్డి, కరుణ, విజయలక్ష్మీ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో నరేశ్ సూచించారు. మండలంలోని చింతకుంట, తక్కళ్ళపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ళ ప్రగతిని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన బోరు బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, కారోబార్లు రాజన్న, సునీల్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఖాళీల భర్తీ ఎన్నడో..?

● గిరిజన సంక్షేమశాఖలో సిబ్బంది కొరత

● ఇద్దరు ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్లు

● ఇన్‌చార్జి బాధ్యతలతో జిల్లా అధికారి

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో ఒకవైపు ఉన్న పోస్టులు భర్తీ కాకపోవడం, మరోవైపు కొత్త పోస్టులు మంజూరు కాకపోవడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గిరిజన ప్రజలు, విద్యార్థులకోసం ఏర్పాటు చేసిన ఈ శాఖలో ఒకే ఒక్క అధికారి మాత్రమే ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగానే ఉంటున్నాయి. జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా గిరిజన సంక్షేమ అధికారి(డీటీడబ్ల్యూవో)గా నీలిమ కొద్దికాలం పనిచేశారు. యేడాది క్రితం ఆమె బదిలీపై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంటోంది. ఆ స్థానంలో ఫుల్ అడిషనల్ చార్జీ (ఎఫ్ఏసీ)గా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రాజ్‌కుమార్‌నునియామకం చేయడంతో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

● పోస్టులన్నీ ఖాళీగానే..

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిబంధనల ప్రకారం ఒక సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్లు, ఒక అటెండర్ పోస్టులు ఉండాలి. కానీ ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖలో పోస్టులు లేకపోవడం, ఉన్న పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం జిల్లా అధికారి మినహా మిగిలిన వారు ఒక్కరు సైతం పనిచేయడం లేదు.

● జిల్లాలో ఆరు గిరిజన విద్యాసంస్థలు..

జిల్లా గిరిజన సంక్షేమశాఖ పరిధిలో ఆరు విద్యాసంస్థలు పని చేస్తున్నాయి. ఇందులో బీర్‌పూర్ మండలం మంగేళలోని బాలికల ఆశ్రమపాఠశాలలో 80మంది విద్యార్థులు, చిత్రవేణి గూడెంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో 70మంది విద్యార్థులు ఉన్నారు. రాయికల్ మండలం జగన్నాథపూర్ ఆశ్రమ పాఠశాలలో 42మంది విద్యార్థులు, ధర్మపురి బాలుర వసతి గృహంలో 30మంది విద్యార్థులు, జగిత్యాలలోని బాలుర వసతి గృహంలో 80మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. గిరిజన విద్యార్థులకు అవసరమైన వసతులు, ఇతరత్రా సదుపాయాలు కల్పించేందుకు సంక్షేమశాఖ కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే గిరిజనసంక్షేమ శాఖలో పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.



కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ కార్యాలయం

● డిప్యూటేషన్లతో సమస్యలు..

జిల్లా గిరిజన సంక్షేమశాఖలో డిప్యూటేషన్ సమస్యలు వేధిస్తున్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన పోస్టుల్లో పలువురు ఉద్యోగులు ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో డిప్యూటేషన్‌లో పనిచేస్తున్నారు. జగిత్యాల బాలురవసతి గృహంలో పని చేస్తున్న వార్డెన్ కరీంనగర్‌కు డిప్యూటేషన్‌లో పనిచేస్తుండగా, మరో మహిళా

-మిగతా 6లో

కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలి

-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లు అన్నారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ చేసిందని వారు విమర్శించారు. గురువారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెల్లని జీవోలతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందన్నారు.

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్ గౌరవాధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు బీసీ రిజర్వేషన్ వ్యవహారంపై తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. పార్లమెంట్‌లో సవరణ చేయకుండా, చట్టబద్ధత లేకుండా 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని బీసీ ప్రజలను మభ్యపెట్టే విధంగా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల హక్కుల కోసం మద్దతు ఉంటుందన్నారు. సమావేశంలో జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు వొళ్లెం మల్లేశం, ఆనంద్ రావు, అనురాధ, శ్రీనివాస్, చింత గంగాధర్, మనలా కిషన్, చెట్టే రాజేశ్వర్, సన్నిత్, దేవేందర్ నాయక్, దావ సురేష్, ఆది రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

కోరుట్ల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంపై గర్భిణీలు, మహిళలు, కిశోర బాలికలు అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మలు అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్ రైతు వేదికలో పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, మహిళలు, కిశోర బాలికలతో పౌష్టిక ఆహారం విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పారిశుద్ధ్యంపై వివరించి తీసుకోవలసిన జాగ్రత్తలను సూచాంచారు. జంక్ ఫుడ్ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలపై మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికార సమీనా ఐసిడిఎస్ సూపర్ వైజర్లు రాధిక హెల్త్ సూపర్ వైజర్లు జస్సీ, ఏఎన్ఎంలు రాణి, ఈఓ నవీన్, సఖీ టీ సభ్యులు పాల్గొన్నారు.

'బాకీ కార్డు పేరుతో బీఆర్ఎస్ డ్రామా'



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాకీ కార్డు పేరుతో బీఆర్ఎస్ డ్రామాలాడుతోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని సైతం పూర్తిగా అమలు చేయలేకపోయిందని ఆయన ఆరోపించారు. మీరు పది ఏళ్ల కాలంలో చేసిన బాకీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ప్రచారం కాదని ప్రజల ప్రయోజనమని గ్రహించాలని ఆయన సూచించారు. పది ఏళ్ల పాలనలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, కొప్పుల ఈశ్వర్ బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ప్రచారానికి ప్రభుత్వ ఖజానా నుండి కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పన్నుతో కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీని నడిపించారని ఆరోపించారు. ఇప్పుడు రుణాల మడుగులో నెట్టిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుందని ఆయన అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇరవై నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనులకు వేగం వచ్చిందని, డిగ్రీ కళాశాల జీవో త్వరలో వస్తుందని ఆయన అన్నారు. గోదావరి నదిలో మురికి నీరు కలువకుండా రూ.17 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు జరుగుతుందని ఆయన తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు పనులు ఇరిగేషన్, ఫారెస్ట్ శాఖ మధ్య సమన్వయ లోపంతో నిలిచి పోయాయని ఆయన అన్నారు. త్వరలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ధర్మపురికి బస్ డిపో, పాలిటెక్నిక్ కళశాలలు త్వరలో ఏర్పాటు కానున్నాయని, నేరెళ్ల వద్ద రూ 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ కళాశాల నిర్మాణానికి డిప్యూటీ సీఎం చేతుల మీదుగా భూమి పూజ జరగనుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ బిల్లులను పరిష్కరించేందుకు ఎస్సీ, ఎస్టీ శాఖలకు అత్యవసర నిధులు కింద రూ.60 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు 2027 గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, బొల్లారపు పోచయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

● కొండగట్టు కల్యాణకట్ట వద్ద ఘటన

● రక్షించబోయిన కోడలుకూ విద్యుదాఘాతం 5

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు మోగిన నగారా

● ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్

● ఒకటిన పోలింగ్.. అదే రోజు ఫలితాలు 5

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

● రూ.4.10 లక్షలు పోగుజేసి మౌలిక వసతుల కల్పన

4

'స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించకుంటే చర్యలు'

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు ప్రయివేటు స్కానింగ్ కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్, డాక్టర్ల అర్హత, ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ, మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని వివరించారు. ఫారం ఎఫ్‌లు ప్రతి నెల నిర్ణీత తేదీ లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో సమర్పించాలని ఆదేశించారు. ఫారం ఎఫ్‌లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేయబడదు అను ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ కార్డియోపల్మనరీ రీసక్సియేషన్(సిపిఆర్)పై అవగాహన కలిగి ఉండాలని ప్రస్తుతం డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఆర్ చేసే విధానంపై ఆరోగ్యశాఖ మండలాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ గుండె సమస్య వచ్చినప్పుడు సీపీఆర్ చేసి అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. సీపీఆర్‌తో ప్రతి సంవత్సరం మృతి చెందుతున్న గుండె పోటు మరణాలు 10 శాతం తగ్గించవచ్చన్నారు. సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాల చేపట్టి ప్రజల్లో చైతన్యం పెంచడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్లు ఎల్లాల అంజిత్‌రెడ్డి, తాటిపర్తి శివాని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రతిభ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, అనుచరులు

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిరుపేదలకు అందించే డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి తన అనుచరులతో గురువారం ధర్నా చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు వ్యవహారంపై సమాలోచన సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇందిరా భవన్ నుంచి బయలు దేరి మున్సిపల్ కార్యాలయం వరకు నినాదాలు ఇస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ కార్యాకర్తలు మున్సిపల్ ముట్టడికి వస్తున్నారన్న సమాచారంతో ముందస్తుగా పోలీసులు గేట్లు మూసి వేసి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తన అనుచరులతో పాటు బైఠాయింపు జరిపి ఆందోళన నిర్వహించారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.

ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వార్డు సభలు నిర్వహించకుండా మొక్కుబడిగా జరిపి ఇళ్ల కేటాయింపులు జరిపారని విమర్శించారు. వార్డు ఆఫీసర్లు సంబంధిత వార్డుల్లో ముందస్తు సమాచారం అందించకుండా ఏకపక్షంగా వార్డు సభలు నిర్వహింపజేయడం, గృహ మంజూరుకు లబ్ధి అవకాశం ఉన్న వారికి ఎవరికీ తెలియకుండా సమావేశాలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ స్పందన నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముందస్తు పత్రికా ప్రకటనలు చేయడం, టీవీ ప్రసారాల ద్వారా, ఇతరత్రా విధానాల ద్వారా వార్డు సభల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాల్సి ఉండగా, నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ పట్ల వివక్షత, ప్రభుత్వం పట్ల అసంతృప్తి ప్రజలకు కలిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తిరిగి ముందస్తు ప్రకటనలు చేయించి వార్డు సభలను నిబంధనల ప్రకారం నిర్వహించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ స్పందనకు జీవన్‌రెడ్డి అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు జిల్లా గంగాధర్, గాజుల రాజేందర్, చాంద్‌పాషా, పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న మండలంలోని అంబారిపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ భూమేశ్వర్ తెలిపారు. అంబారిపేట, పోతారం, ఇప్పపల్లి, తుర్తి గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. రైతులు, గృహ వినియోగదారులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక ఓల్డ్ హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైం పై పట్టణ, ట్రాఫిక్. పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులు 18 సంవత్సరాలు దాటిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలన్నారు. అదేవిధంగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేపుడు సీట్‌బెల్టు ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం టౌన్ ఎస్ఐ రవి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని, విద్యార్థులు తమ ఫోటోలను స్టేటస్‌గా గానీ, ఇన్‌స్టాగ్రామ్‌లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో గానీ పోస్టు చేయవద్దని సూచించారు. ఏఐ ద్వారా ఫోటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉన్నందున పోస్టు చేయవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాష్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనందరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్య

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణం చెందారు. వీరిలో నలుగురు ఉరి వేసుకోగా ఒకరు పురుగుల మందు తాగారు. వివరాల్లోకి వెళితే..

ఉరి వేసుకుని..


రాజేశం(ఫైల్)

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గుర్రాల రాజేశం(60) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశం కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యం తో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి ఎస్‌ఐకొట్టేప్రసాద్, ఏఎస్‌ఐఖలీల్‌ఖాన్, సిబ్బంది రమీజ్ పరిశీలించారు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


శివకుమార్(ఫైల్)

వెల్గటూర్: వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన తనుగుల శివకుమార్ (33) అనేయువకుడు గురువారం ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపినవివరాల ప్రకారం శివకుమార్ నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లాడు. సంవత్సరం తర్వాత అనారోగ్య కారణంగా మతిస్థిమితం కోల్పోయాడు. అక్కడి వారి సహాయంతో సొంత గ్రామానికి తిరిగి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని మందులు వాడుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తనుగుల వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జ్యోతినగర్: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కాసుల రాకేష్(31) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగు రోజులక్రితం ఆత్మ హత్య చేసుకున్న రాకేష్ మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న రాకేష్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. ఏడాది క్రితం అతని తండ్రి, 15రోజుల క్రితం రాకేష్ తల్లి చనిపోయింది. నాలుగు రోజుల క్రితమే తండ్రి సంవత్సరీకం, తల్లి దశదిన కర్మ నిర్వహించాడు. రాకేష్‌కు అక్క, బావ ఉన్నారు. దశదిన కర్మ జరిగిన రోజున బావతో రాకేష్ గొడవ పెట్టుకు న్నాడు. దీంతో అక్క, బావలు ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు దూరమైన బాధలో ఉన్న సమయంలో అక్కాబావలు కూడా దూరం కావడంతో రాకేష్ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో అదేరోజు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు తలుపు తెరవడతో రాకేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడైంది. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మాధురి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన మాధురి(22) అనేవివాహిత బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎక్కల్‌దేవి రవి 2024ఆగస్టు 24న మాధురిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్ని రోజుల నుంచి అత్తింటి వేధింపులతో మాధురి బాధ పడుతుండేదని, భర్త ఎక్కల్‌దేవి రవి, అత్త ఎక్కల్‌దేవి సత్తమ్మ, మామ రాజం, ఆడబిడ్డ రవళి వేధింపులతో మాధురి ఆత్మహత్య చేసు కుందని తల్లి ఎర్ర లావణ్య పోలీసులకు ఫిర్యా దు చేసింది. తహసీల్దార్ నీత సమక్షంలో పంచనామా చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. భర్త, అత్తమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైఎస్సై-2 రాజునాయక్ తెలిపారు.

పురుగుల మందు తాగి..

రుద్రంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పిట్టల నర్సయ్య (62)అనేవ్యక్తి బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసు కున్నాడు. స్థానికులు, పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం పిట్టల నర్సయ్య అప్పుల బాధతో మనస్తాపానికి గురై బుధవారం పొలంవద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు జీవం

- రూ.4.10 లక్షలతో మౌలిక వసతుల కల్పన
- ఆదర్శంగా నిలుస్తున్న చింతకుంట గ్రామస్థులు
- దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్ల నియామకం



రంగులతో అందంగా కనిపిస్తున్న చింతకుంట పాఠశాల

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు గ్రామస్థులు జీవం పోశారు. అరకొర వసతులు, విద్యార్థులు లేక బోసిపోతున్న పాఠశాలల రూపు రేఖలు గ్రామస్థుల సహకారంతో ఒక్కసారిగా మారిపోయాయి. యువత, గల్ఫ్ వలస జీవులు, మహిళలు, కుల సంఘాలు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీలకు అతీతంగా నేతలు ఒక్కటై రూ.4.10 లక్షలు పోగు చేసి విద్యార్థుల సంఖ్యను అనూహ్యంగా పెంచి పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆ మారుమూల పల్లెలో సర్కారు బడి సౌకర్యాలు సమ కూర్చుకొని విద్యార్థులతో సందడిగా కనిపిస్తోంది.

ప్రైమరీ, హైస్కూల్‌లో పెరిగిన విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది కేవలం 50 మంది మాత్రమే చదువుతుండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 131 మందికి చేరింది. ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 53 మంది ఉండగా ప్రస్తుతం 101 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత వేసవి సెలవుల్లో గ్రామస్థులంతా కలిసి తమ పిల్లలను ప్రైవేట్ బడికి పంపవద్దని నిర్ణయించుకున్నారు. మూతపడే పరిస్థితికి చేరిన పాఠశాలను బతికించుకునేందుకు ఎన్‌ఆర్‌ఐ, యువజన సంఘాలు, మహిళలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి విరాళాల సేకరణకు పూనుకున్నారు. రూ.4.10 లక్షలు పోగు చేసి పాఠశాలకు గేట్లు ఏర్పాటు చేశారు. చిన్నారులను విద్య పట్ల ఆకర్షితులను చేయా లనే తలంపుతో పాఠశాల గోడలపై ఆకర్షణీయమైన రంగులతో బొమ్మలు వేయించారు. సైన్స్, సోషల్‌కు సంబంధించి పటాలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ప్రహరీ లేకపోవడం వల్ల చుట్టూ రంగుల నెట్‌ను రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్నారు.

2009-10 పదో తరగతి పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో ఫిల్టర్ వాటర్‌ప్లాంట్, 2011-12 బ్యాచ్ విద్యార్థులు వాటర్ ట్యాంక్, ఎలక్ట్రికల్ బెల్ ఏర్పాటు చేయించారు. పాఠశాలల్లో సీసీ కెమెరా లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యా ర్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశా లలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. దీంతో ఇద్దరు దాతల సహకారంతో ముగ్గురు విద్యా వలంటీర్లను నియమించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. ప్రీ ప్రైమరీలోనూ 20 మంది ప్రవేశాలు పొందారు.

అదనపు తరగతి గదులు అవసరం..
సుధాకర్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం



ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య ఊహించని విధంగా పెరగడానికి గ్రామస్థులు చేసిన కృషి ఎంతో ఉంది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ఉన్న ఐదు గదు లు సరిపోవడం లేదు. ప్రీప్రైమరీ కూడా కొన సాగిస్తున్నందు వల్ల అదనంగా తరగతి గదులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మరుగుదొడ్డి, గదుల మరమ్మతులు కొనసాగుతున్నాయి.

బోరు ఏర్పాటు చేయాలి..
: రవి, హైస్కూల్ హెచ్‌ఎం



రెండు పాఠశాలలు ఒకే ఆవరణలో ఉండగా తాగునీటికి బోరు లేదు. గ్రామస్థులను ఒప్పించి పక్కనే ఉన్న బోరును వినియోగించుకుంటున్నాం. నీరు సరిపోవడం లేదు. ప్రహరీ నిర్మాణం చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఇదే ఆవరణలో కొనసాగుతున్నాయి. మౌలిక వసతులు ఉంటేనే విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతారు.



ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, పాఠశాల చుట్టూ రక్షణ కోసం చేసిన ఏర్పాట్లు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) ఇల్లందకుంట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహ ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లు సిరిసేడు వస్తుండగా, ఆపి తనిఖీచేశారు. సంబంధిత పత్రాలు లేకపోవడంతో రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామ శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్దపాక గ్రామానికి చెందిన జక్కుల దేవేందర్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తుండగా గ్రామశివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరళిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మల్లారెడ్డిపేటకు చెందిన చందు, నందం అనే వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారని ఎస్‌ఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరళించినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ వెల్లడించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో గురువారం పొత్కపల్లి పోలీసులు పేకాటకేంద్రంపై దాడి చేశారు. గ్రామశివారులో కొందరు పేకాట ఆడుతుండగా ఐదుగురిని అదుపులోకితీసుకొని వారినుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో యువకులు, జూదం, ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు.

రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ పోటీలు ప్రారంభం

- బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పోటీలు
- పోటీలను ప్రారంభించిన జోనల్ సీఈ విజయ్‌కుమార్


ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయంలో బాస్కెట్‌బాల్‌లో తలపడుతున్న నల్గొండ, కరీంనగర్ జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో డిస్కమ్స్ సర్కిల్‌ల బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ పోటీలు జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్‌సర్కిల్ బాస్కెట్‌బాల్ కోర్టులో గురువారం ప్రారంభమయ్యాయి. కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఓఎంసీ సర్కిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10సర్కిళ్ల టేబుల్ టెన్నిస్ జట్లు, ఏడు సర్కిళ్ల బాస్కెట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయి. పోటీలను కరీంనగర్ జోనల్‌సీఈ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ సర్కిల్ క్రీడలకు పెట్టింది పేరన్నారు. పలు క్రీడాంశాల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్‌ను కరీంనగర్ సర్కిల్ సాధిస్తుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్ ఎల్లవేళలా క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహిస్తాయన్నారు. ఈనెల 18వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌ఈ ఎన్ శ్రీనివాస్, ఎస్‌ఈ ఆపరేషన్ ఎం రమేష్ బాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్ జగన్నాథ్, కరీంనగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు పి రఘునందన్, ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మొదటి రోజు బాస్కెట్‌బాల్ పోటీల ఫలితాలు...

మొదటిమ్యాచ్‌లో కరీంనగర్ ఆపరేషన్‌జట్టు నల్గొండ ఆపరేషన్ జట్టుతో తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఓఎంసీ కరీంనగర్‌జట్టు నిజామాబాద్ ఆపరేషన్ జట్టుతో తలపడగా నిజామాబాద్ ఆపరేషన్ జట్టు విజయం సాధించింది. మూడోమ్యాచ్‌లో నల్గొండ ఆపరేషన్ జట్టు నిజామాబాద్ ఓఎంసీ జట్టుతో తలపడగా నల్గొండ జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో కరీంనగర్ ఓఎంసీ జట్టు ఖమ్మం ఆపరేషన్ జట్టుతో తలపడగా ఖమ్మం ఆపరేషన్ జట్టు విజయం సాధించింది.

బెదిరింపులకు పాల్పడుతున్న
ఇద్దరిపై కేసు, ఒకరి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మీడియా ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్న వేములవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టుచేసినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ టౌన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణం అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మెల మహిపాల్ అనేవ్యక్తి వృత్తిపరంగా ఒగ్గు కళాకారుడు. గంగాదేవిని పూజిస్తూ నవుడాలమ్మ పూజలు చేస్తూ మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల 11న వేములవాడకు చెందిన ఓవ్యక్తి జర్నలిస్టు ముసుగులో మహిపాల్‌కు ఫోన్‌చేసి నీవు వేములవాడకు రావాలని రాకపోతే నీపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. మహిపాల్ వేములవాడకు వచ్చి ఆ వ్యక్తిని కలుసుకోగా ఏ విషయమై నాపై ఫిర్యాదు చేస్తావని అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పడమే కాకుండా నీ గురించి పేపర్‌లో రాస్తానని బెదిరించాడు. మరుసటి రోజు మళ్లీ ఆవ్యక్తి ఫోన్‌చేసి నీవు ఒకరిని మోసం చేశావని బాధితులు పేపర్‌లో రాయమని ఒత్తిడిచేస్తున్నారని రాయకుండా ఉండాలంటే మరోవ్యక్తి అయిన రాజుకి రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈనెల14న ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించాడు. అయినప్పటికీ మిగితా రూ.20వేలు ఇవ్వాలని బెదిరించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కరుణాకర్ అనే వ్యక్తి రిమాండ్‌కు తరలించామని, రాజు పరారీలో ఉన్నాడని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్ స్టేషన్‌కు తరలించిన మట్టి ట్రాక్టర్లు

చందుర్తి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్నట్లు చందుర్తి ఎస్‌ఐ రమేష్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం గురువారం మర్రిగడ్డ నుంచి దేవునితండా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జోగాపూర్ గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, డ్రైవర్లు అణుగుల దేవరాజ్, రత్నం సంజీవ్ అదుపులోకి తీసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ జె. రమేష్ తెలిపారు.

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరలు

వేములవాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులు పండించిన ధాన్యం కనీసం మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈసందర్భంగా 2025-26 సంవత్సరానికి మార్కెట్‌కమిటీ కార్యదర్శి సత్యనారాయణ ధరల పట్టికలో మద్దతు ధరలను గురువారం పొందుపరిచారు. రైతులు పండించిన వివిధరకాల ధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించిన ఒకక్వింటాలు ధరలు ఇలా ఉన్నాయి. ధాన్యం సాధారణరకం రూ.2,369, ధాన్యం గ్రేడ్ ఏరకం రూ.2,389, జొన్నలు హైబ్రీడ్ రకం రూ. 3,699, జొన్నలు మాల్దండి రకం రూ.3,749, సజ్జలు రూ. 2,775, రాగులు రూ.4,886, మొక్కజొన్న రూ. 2,400,కందులురూ.8వేలు, పెసర్లురూ.8,768, మినుములు రూ.7,800,వేరుశనగకాయలు రూ.7,263, పొద్దుతిరుగుడు రూ.7,721, సోయా చిక్కుడు రూ.5,328, నువ్వులు రూ.9,846, వలసలు (గడ్డినువ్వులు) రూ.9,537, పత్తి మధ్యరకం పింజ రూ.7,710, పత్తిపొడుగు రకంపింజరూ.8,110క్వింటాళుకు ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో కొనుగోలు చేసిన ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి వస్తున్న ఓవ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్‌తెలిపిన వివరాల మేరకు.. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన ఆడేపు కుమార్ (54) కరీంనగర్‌లో సెకండ్ హ్యాండ్‌బైక్ కొనుగోలు చేశాడు. అదే బైకుపై ఇంటికి వస్తున్నాడు.

మరో ఐదునిమిషాల్లో ఇంటికి చేరుతాడనగా, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి-సుల్తాన్‌పూర్ గ్రామాలమధ్య సైకిల్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఆడేపు కుమార్ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాద వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు

శంకరపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదుట గురువారం రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్, సిరిసిల్ల డిపోలకు చెందిన బస్సులు బస్టాండ్ ఎదుట ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బస్సుల్లోని కొంత మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- నాలుగు తులాల బంగారం, నగదు అపహరణ


బీరువా తాళలు పగలగొట్టి బట్టలను చెల్లా చెదురు చేసిన దొంగలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 4తులాల బంగారం, 50వేల నగదును ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్‌మాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న మానస అనే గృహిణి బుధవారం రాత్రి తన ఇంటికి తాళం వేసి తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 4తులాల బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించింది. బాధితురాలు పోలీసులకు సమాచారం అందిచడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన జక్కుల శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసులో ఇదే గ్రామానికి చెందిన నక్క రవిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు, రవిల మధ్య కొంతకాలంగా డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇరువురి మధ్య పంచాయతీలు కూడా జరిగాయి. డబ్బుల విషయంలో విసిగిపోయిన రవి గురువారం శ్రీనివాస్‌ను చంపివేయాలనే ఉద్దేశ్యంతో కూరగాయలు కోసే కత్తితో దాడిచేశాడు. దాడిలో శ్రీనివాస్‌కు చేతికి, గదవపై గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టిన సిరిసిల్ల సీఐ మొగిలి నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ధర్మపురి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గంజాయి సరఫరా చేస్తున్న చొప్పరి పృథ్వీరాజు అనేవ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మపురి పట్టణానికి చెందిన పృథ్వీరాజు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అతనిని సోదా చేయగా 103గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గర్రెపల్లిలో యువకుల వీరంగం

- చికెన్ సెంటర్ నిర్వాహకులపై కత్తులతో దాడి
- ముగ్గురికి గాయాలు


షాపులో నుంచి కత్తి తీస్తున్న యువకుడు

సుల్తానాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి బస్టాండ్ సమీపంలో మద్యం మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. రోడ్డు పక్కనున్న చికెన్ సెంటర్ నిర్వాహకులపై యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా, ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గురువారం రాత్రి గర్రెపల్లి బస్టాండ్ సమీపంలోని చికెన్‌సెంటర్ వద్దకు కారులో ముగ్గురు వ్యక్తులు బీర్లు తాగుతూ సీసాలు చేతిలో పట్టుకుని వచ్చారు. చికెన్ కావాలని నిర్వాహకులతో గొడవపడ్డారు. ఒక్కసారిగా యువకులు చికెన్ సెంటర్ నిర్వాహకులను చికెన్ కొట్టడానికి ఉపయోగించే కత్తిని తీసుకొని దాడిచేయగా, నిర్వాహకులు, రసీద్‌కు గాయాలయ్యాయి. గొడవను ఆపే ప్రయత్నంలో పక్కనున్న మరో దుకాణం యజమానిని కూడా కొట్టారు. అనంతరం ముగ్గురు యువకులు అదే కారులో పరారయ్యారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. పారిపోయిన వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ముగ్గురు యువకులు చికెన్ సెంటర్ నిర్వాహ కులపై దాడి చేశారని, వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.6700 పలికిన పత్తి ధర


పత్తి కొనుగోళ్లు పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 170మంది రైతులు 1292క్వింటాళ్లు విడి పత్తి, 30మంది రైతులు 44క్వింటాళ్లు గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6700, కనిష్ఠ ధర రూ.5300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు. శని, ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, దీపావళి పండుగ సందర్భంగా సోమ, మంగళవారం యార్డుకు సెలవు దినాలు ప్రకటించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



చింటూ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదా రిపై గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్న ఓయువకుడు అక్కడి కక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామానికిచెందిన చింటూ(22)ఇసుక ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. విలాసాగర్ నుంచి పెద్ద పాపయ్యపల్లెకు ఇసుకను అన్‌లోడ్ చేసిన అనంతరం తిరిగి తనస్వగ్రామానికి రంగాపూర్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో రాంపూర్ శివారులో నిర్మాణంలో ఉన్న జాతీయరహదారిపై ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం మూలంగా అదుపుతప్పి ట్రాక్టర్ ఒక్కసారిగా రహదారిమీద నుంచి పక్కనేఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడిన డ్రైవర్ చింటూ తీవ్రగాయాలై ఘటనస్థలంలోనే మృతిచెందాడు. విషయం తెలుకున్నపోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్‌కింద ఇరుక్కుపోయిన చింటూ మృతదేహాన్నిపోలీసులు స్థానికుల సహాయంతో బయటకు తీశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతు న్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మంథని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొడుగు బిల్డింగ్ ఏరియా సమీపంలోని ఓ ఇంట్లో పట్టణానికి చెందిన బండారి శ్రీనివాస్ అనే యువకుడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీరామకాలనీ సమీపంలో కొనుగోలు చేసిన భూమిని యజమాని మరో వ్యక్తికి సైతం విక్రయించడంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ తనకు భూమి అమ్మినవ్యక్తి ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. దీంతో అక్కడే ఉన్న వారు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనం తరం మెరుగైన చికిత్సకోసం గోదావరిఖనికి తరలించగా చికిత్స పొందు తున్నాడు. ఈమేరకు పోలీసులు విచారిస్తున్నారు.

శ్రీరాంసాగర్ వరద గేట్ల మూసివేత

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను గురువారం మూసివేశారు. ఎగువ ప్రాంతం నుంచి 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

బంతి పూల సాగుతో భరోసా

● కిలో రూ. వంద వరకు పలికిన ధర ● రైతుల వద్ద కొనుగోలు చేసిన ప్రజలు





చొప్పదండి మండలంలో సాగవుతున్న బంతి పూల తోట, మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో పూలు తెంపుతున్న మహిళా రైతు

చొప్పదండి/మానకొండూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు బంతి పూల సాగు చేసిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది. అటు దిగుబడితో పాటు ఈసారి మంచి ధర పలకడంతో బంతిపూల రైతులకు కాలం కలిసి వచ్చింది. పంటకు పెట్టుబడి బాగా పెరిగినప్పటికీ, చాలా మంది రైతులు రోడ్లపై రిటైల్‌గా బంతి పూలను కిలో వంద రూపాయలకు అమ్ముకున్నారు. పూలు కావలసిన ప్రజలు కూడా బంతి పూల తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేశారు. ఎకరంలో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు బంతి పూల దిగుబడి రావడంతో రెండు లక్షల వరకు పలువురు రైతులకు ఆదాయం లభించింది. బతుకమ్మ, దసరా పండుగలకు బంతి పూలకు ఈ సారి మంచి డిమాండ్ ఏర్పడడంతో పాటు మంచి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



కాగా మరో మూడు రోజుల్లో దీపావళి పండుగ రానుండగా బంతి పూలకు డిమాండ్ బాగా ఉండడంతో రైతులు తమ పంటకు అదే ధర పలుకుతుం దనే ఆశతో ఉన్నారు. గతంలో బంతి పూలను 10, 20 రూపాయలకు కిలో అమ్మి నష్టపోయిన సందర్భాలు ఉండగా ఈ సారి మాత్రం కిలో పూలకు వంద రూపాయలు పలకడం రైతులను గట్టెక్కించింది. మండలంలో దాదాపు 200 ఎకరాల్లో బంతి పూల సాగును రైతులు చేపట్టారు.

● లక్ష్మీపూర్‌లో...

మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పెద్ది కావ్య-శ్రీనివాస్ అనే రైతు దంపతులు 20 గుంటల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగు చేశారు. పువ్వులు పూరిత స్థాయిలో కోతకు రాకపోవడంతో ఇటీవల దసరా పండుగకు అమ్మకాలు తక్కువగా జరిగాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో కోత దశకు వచ్చింది. దీంతో రెండు రోజుల్లో పువ్వులను కోసి మార్కెట్‌కు తరలిస్తామని రైతు దంపతులు తెలిపారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ముద్దసాని రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 14న ప్రారంభమైన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లాస్థాయి అండర్19 వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలబాలికల విభాగంలో 85జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మంచి ప్రతిభకనబరిచిన శ్రీ చైతన్య డిఫెన్స్‌అండ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు మొదటిస్థానంలో నిలిచారు. ఈ ముగింపు కార్యక్ర మానికి విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపు, ఓటములు సహజమని ఓడిన వారు నిరాశ పడకుండా, గెలుపు కోసం ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం ఎస్ఐ రంజిత్‌కుమార్, ఎస్‌జీఎఫ్‌ఐ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, డిఫెన్స్ అకాడమి ప్రిన్సిపాల్ పల్లె శ్యాం సుందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, పిడిలెంకల మహిపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వ్యక్తిపై దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూత్రవిసర్జన చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి నలుగురు విచక్షణరహితంగా దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. తనను పోలీసులే కొట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. కరీంనగర్‌కు చెందిన పరశురాం కూలీ పనిచేసుకుంటూ రోడ్లపైన జీవనం సాగిస్తున్నాడు. తాగినమత్తులో బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేయడంతో పలువురు కొట్టారు. దాడిలో చెయ్యి విరిగింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు చెయ్యి విరిగిందని సర్జరీ అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. పోలీసులు కొట్టారని బాధితుడు తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మత్స్యకారులకు అండగా నిలవాలి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు అండగా నిలువాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకటి శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. హైద్రాబాద్‌లో గురువారం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ చైర్మన్ చొప్పరి రామచంద్రం ఆధ్వర్యంలో కలిసి సమస్యలను వివరించారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో మత్స్యకారులకు సొసైటీ భవనాలు నిర్మించాలని, 55 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘ మాజీ అధ్యక్షుడు కంకటి ప్రభాకర్, నాయకులు కూనబోయిన పర్శరాం, శ్రీకాంత్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలి



రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు ఫ్లెక్సీ కట్టిన రైతులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలం కేటాయించాలని రైతులు రోడ్డును ఆక్రమించుకుని ఆందోళన చేపట్టారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనువైన స్థలాలు లేకపోవడం వల్ల ప్రధాన రహదారిపై ధాన్యం కుప్పలు పోయాల్సి వస్తోందని, వాహనదారులు మరోదారి నుంచి వెళ్లాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంకటాపూర్- రగుడు బైపాస్ రహదారికి ఓ వైపు గురువారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రహదారిపై టైర్లు వేసి అడ్డుగా కట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ప్రధాన రహదారిని మూసి వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీని తొలగించేందుకు యత్నించారు. దాంతో రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధాన్యం కుప్పలు పోసుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు.అనంతరం రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు తొలగించారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఈ నెల 17న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు రైతులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమం లో వెంకటాపూర్, సిరిసిల్ల విలీన గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం కొండంత..!

● దేవస్థానం పరిధిలో ఒక్కరే విద్యుత్ సిబ్బంది
● పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు సిబ్బంది కరువు
● పట్టించుకోని దేవాదాయశాఖ.. భక్తులకు శాపం



మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో స్వామి వారి దర్శనానికి వచ్చిన గోదావరిఖనికి చెందిన రాజేశ్వరి అనే భక్తురాలు గురువారం విద్యుదాఘాతంలో మృతిచెందడం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యమేననే సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యంవేలాది మంది, ఉత్సవాల సమయంలో లక్షలాదిగా భక్తులతో రద్దీగా ఉండే ఇక్కడ విద్యుత్‌కు సంబందించి విధులు నిర్వహించే సిబ్బంది ఒక్కరేఉండడం చర్చనీ యాంశంగా మారింది. దేవస్థానం పరిధిలో 60కమర్షియల్, నీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు ఉండడం, దిగువకొండగట్టు, ఇతరప్రాంతాల్లోను కనెక్షలు వినియోగంలో ఉన్నాయి. వీటిని ఒక్కరు మాత్రమే పర్యవేక్షణ చేయడంప్రమాదాలకు కారణంగా పేర్కొంటున్నారు. దీనికితోడు రెండేళ్లగా ఇంజనీరింగ్ అధికారులు లేకపోవడంతో పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఎలక్ట్రీషియన్‌కే అప్పగించినట్లు తెలుస్తోంది.

● విద్యుత్ తీగలు ఊడి..

కొండపైన కల్యాణకట్టలో ప్రతిఏటా జరిగే జయంత్యుత్సవాల సందర్భంగా దీక్షాపరులు మాలవిరమణ చేస్తుంటారు. దీంతో అక్కడేగల మూత్రశాల వద్ద ట్యూబ్ లైట్ అమర్చారు. ఇటీవల కోతులు ట్యూబ్‌లైట్ తీగలు తెంచడంతో అవి అలాగే వేలాడుతున్నాయి. తరచూ కళ్యాణకట్టలోఇతర వాటి కోసం విద్యుత్ సరఫరా చేస్తుండగా తెగిన తీగల దానికి కూడా కరెంటు సరఫరా అవుతోంది. దీంతో బుధవారమే ఈ తీగలతో ఓ వానరం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అప్పుడే తగుచర్యలు తీసుకుంటే గురువారం ప్రమాదం జరిగి ఉండేదికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● కొండపై లూజు తీగలే అధికం

కొండపైన విద్యుత్‌సిబ్బంది కొరతతో లూజు తీగలే అధికంగా దర్శనమిస్తుంటాయి. కోతులతో అవి కూడా వేలాడుతున్నాయి. తరచూ తీగలు తెగిప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ సిబ్బందిని నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

● కొండగట్టు కల్యాణకట్ట దగ్గర ఘటన
● రక్షించబోయిన కోడలుకూ విద్యుదాఘాతం



రాజేశ్వరి(ఫైల్)

మల్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రాజేశ్వరి అనే (84) వృద్ధురాలు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పెద్దపల్లిజిల్లా గోదావరి ఖనికి చెందిన సత్యనారాయణ తన తల్లి, భార్యతో గురువారం వేకువజామున కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చారు. రాజేశ్వరి కాలకృత్యాలు తీర్చుకునేందుకు కల్యాణకట్టవద్ద గల మరుగుదొడ్లవద్దకు వెళ్లింది. క్రమంలో వృద్ధురాలు అక్కడున్న బారికేడ్‌ను ముట్టకోగా దానిపై తెగిపడిన విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే రక్షించేందుకు రాజేశ్వరి కోడలు యత్నించగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబసభ్యులు స్థానికులసహాయంతో కల్యాణకట్టలో విద్యుత్‌సరఫరాను నిలిపివేశారు. అనంతరం వృద్ధురాలిని చికిత్స కోసం జగిత్యాలకుతరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. ప్రమాదానికి ముందు మరుగుదొడ్లకు వెళ్లే మార్గాన్ని బారికేడ్‌తో మూసివేసినప్పటికీ కొండపైన తలనీలాల సేకరణ కాంట్రాక్టర్‌వద్ద పనిచేసే సురేశ్‌బాబు అనే వ్యక్తి తొలగించాడని సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

● దేవస్థానం ఈవోతో పాటు పలువురిపై కేసు

విద్యుదాఘాతంలో తమ తల్లి రాజేశ్వరి మృతికి దేవస్థానం ఈవో, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుమారుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈవోతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మెట్‌పల్లి విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన మెట్‌పల్లి విద్యార్థుల ప్రాజెక్టు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల జిల్లాకు చెందిన జడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)- మెట్‌పల్లి విద్యార్థులు వర్షిత, వాగ్దేవిలు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 18 నుంచి 23వరకు భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి రాజ్యస్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరవుతారని పాఠశాల హెచ్‌ఎం కనకతార, గైడ్ టీచర్ సతీష్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌లు శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ ప్రదర్శనలో బహుళ ప్రయోజన పంటల సంరక్షణ పరికరం రైతుల పంటల సంరక్షణలో ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం అందిస్తుందని వారు తెలిపారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు మోగిన నగారా



● ఎన్నికల అధికారిగా డీసీవో మనోజ్‌కుమార్
● 12 డైరెక్టర్ పోస్టుల్లో ఒకటి ఎస్సీ, ఎస్టీ, రెండు మహిళలకు రిజర్వు
● 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
● 24న పరిశీలన... 25న తుది జాబితా విడుదల
● 1న పోలింగ్.. అదే రోజు ఫలితాల వెల్లడి



కరీంనగర్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ అడిషనల్ రిజిస్ట్రార్ జి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా జగిత్యాల జిల్లా సహకారశాఖ అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్‌ను నియమించారు. నవంబరు 1న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. 2017 ఏప్రిల్‌లో పాలకవర్గ పదవీ కాలం ముగియగా ఎనిమిదేళ్ళుగా ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ వచ్చింది.

ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం మూడు రోజుల క్రితం ముగిసింది. ఈసారి కూడా ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడమా... కొత్త కమిటీని వేయడమో జరుగుతుందనే ప్రచారం జరిగింది. దీంతో అర్బన్ బ్యాంకు సభ్యులతోపాటు పాలకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెల కొంది. అర్బన్ బ్యాం కు పాలకవర్గం, అధి కారులపై వేసిన నాలుగు కేసులను పరిశీలించిన న్యాయస్థానం గత మంగళవారం అన్నింటిని కొట్టి వేయడంతో ఎన్నికలకు మార్గం సుగమమైంది. ఎనిమిదేళ్ల తర్వాత ఎట్టకేలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఉత్కంఠకు తెరపడటమే కాకుండా సభ్యులతోపాటు బ్యాంకు వర్గాల్లో కూడా హర్షం వ్యక్తమవుతోంది.

కరీంనగర్, జగిత్యాల, గంగాధర అర్బన్ బ్యాంకుశాఖల్లో మొత్తం 9,300 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. 12 డైరెక్టర్ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన మొదటి 12 మంది సభ్యులను ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. డైరెక్టర్ల ఎన్నిక అనంతరం ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా డైరెక్టర్లు ఎన్నుకుంటారు. అధికారుల నుంచి ఒకరిని, రిటైర్డు ఉద్యోగుల నుంచి ఒకరిని కో ఆప్షన్ సభ్యులుగా సహకారశాఖ అధికారులు నియమిస్తారు.

9,300 మంది సభ్యులకు ఓటు హక్కు

12 మంది డైరెక్టర్ల ఎన్నికకు బ్యాలెట్ ద్వారా పోలింగ్ :

ప్రస్తుత నోటిఫికేషన్‌లో 12 మంది డైరెక్టర్లకు బ్యాలెట్ ద్వారా సీక్రెట్ ఓటింగ్ నిర్వహించాలని సూచించింది. 12 మంది డైరెక్టర్ స్థానాల్లో ఒక స్థానాన్ని ఎస్సీ లేదా ఎస్టీకి, రెండు డైరెక్టర్ స్థానాలను మహిళలకు, 9 డైరెక్టర్ పదవులను ఓపెన్ కేటగిరీకి రిజర్వు చేశారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 24న నామినేషన్లను పరిశీలించి 25న తుది జాబితాను విడుదల చేస్తారు. నవంబరు 1న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్లను లెక్కిస్తారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు లైట్ బ్లూ కలర్ బ్యాలెట్, మహిళా స్థానాలకు పింక్ కలర్, ఓపెన్ కేటగిరీ స్థానానికి తెల్ల రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించాలని సూచించారు.

రద్దు చేసిన సభ్యులకు తిరిగి అవకాశం

2007-17 వరకు అధికారంలోఉన్న పాలకవర్గ సభ్యులు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సభ్యత్వాలు ఇచ్చారని, మరికొన్ని ఆరోపణలతో కొందరి సభ్యత్వాలను రద్దు చేసింది. దీంతో వారు కోర్టును ఆశ్రయించగా సభ్యత్వాల రద్దును కొట్టివేస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. పాత పాలకవర్గ కమిటీ సభ్యుల సభ్యత్వాలు యథావిధిగా కొనసాగడంతోపాటు తిరిగి పోటీచేసే అవకాశం లభించింది. ఆర్థిక లావాదేవీలతో కూడిన బ్యాంకు పాలకవర్గం ఎన్నికలను పార్టీరహితంగా నిర్వహిస్తున్నప్పటికి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరపార్టీలు వారి ప్యానల్స్‌తో ఎన్నికల బరిలో నాయకులను నిలుపుతారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ పాలకవర్గం, తాజా మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు రెండు ప్యానల్స్‌గా పోటీచేసే అవకాశాలున్నాయి.

ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడిజిల్లాస్థాయి ఆర్చరీ పోటీలను సెంటనరీకాలనీలోని రాణిరుద్రమాదేవి క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఇందులో పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల,జగిత్యాలజిల్లాల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14,17విభాగంలో ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ తదితర అంశాల్లో పోటీల్లో తలపడ్డారు. ఇందులో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ ప్రధానకార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారంతా ఉమ్మడిజిల్లా తరపున రాష్ట్రస్థాయికి ఆడతారని శ్రీనిత్యద్వితీయ,మితాలితృతీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, లింగం శ్రీనివాస్, వెంకటేష్, శిరీష, సింగరేణి క్రీడాకారులు రవి, అఖిల్, సంతోష్, అభిషేక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం

భగత్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపో మేనేజర్లతో రీజినల్ మేనేజర్ బి రాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ లక్కీ డ్రాను ప్రకటించింది. విజేతలైన కరీంనగర్‌కు చెందిన ఇ రమేష్‌కు 25 వేల రూపాయలు, గోదావరిఖనికి చెందిన సదానందంనకు 15 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం బి రాజు

సీసీ రోడ్డు వేయాలని వినతి

రాయికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని 8వ వార్డులో సీసీ రోడ్డు వేయాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు గురువారం వార్డు ప్రజలు వినతి పత్రం సమర్పించారు. రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి నీరు నిలవడంతో నడవడం కూడా కష్టంగా మారిందని, నిరంతరం ట్రాక్టర్లు వెళ్లడంతో పరిస్థితి ఇంకా దిగజారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లికొండ గంగాధర్, దువ్వాక మహేష్, కల్లెడ గణేష్, అంజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

కోరుట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యులు మైక్ సెట్‌ను అందజేశారు. గురువారం రూ. 18,000 వేల విలువగల మైక్ సెట్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ చీఫ్ కో అర్డినేటర్, సేవా తపనతో ముందుండే దాతృత్వ మూర్తి లయన్స్ క్లబ్ సభ్యుడు మంచాల జగన్ ఆధ్వర్యంలో విరాళంను అందజేశారు.

విరాళం అందించిన లయన్స్ క్లబ్ సభ్యుడు మంచాల జగన్‌ను పాఠశాల ప్రదానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు కృష్ణమోహన్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమ్ముల జీవన్ రెడ్డి, ఏలేటీ లక్ష్మారెడ్డి, గుంటుక మహేష్, బెజెంకి శ్రీనివాస్ రావు, కూడెల్ రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల సూచనల మేరకు, నేషనల్ గ్రీన్ కార్పొరేషన్ తెలంగాణ వారి సహకారంతో పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాంపస్ ఈకో బజార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు.

అనంతరం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ విద్య అవగాహనకై, వివిధ పర్యావరణ రహిత వస్తువుల కార్యశాల, తయారీ, ప్రదర్శన మరియు అమ్మకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు పెంపొందించవచ్చన్నారు. ఇందులో జిల్లాలోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8501864446 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

రాయికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ముత్యాల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యూత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు కలిసి రూ.24,100లను రాములు కుటుంబ సభ్యులకు అందించారు.

వరుస చోరీలతో ప్రజలు బెంబేలు

●సీసీ కెమెరాలు ఉన్నా దొరకని ధరూర్, పొరండ్ల దొంగతనాల నిందితులు ● గాలిస్తున్న మూడు పోలీసు బృందాలు

జగిత్యాలరూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వచ్చి, ఇళ్ల తాళాలు పగుల కొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. పోలీస్ శాఖ నిరంతరం కెమెరాలు సిబ్బం దితో పర్యవేక్షిస్తున్నా వరుసగా చోరీలు జరుగుతుండటం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లా పోలీస్ కార్యాల యాలు, స్టేషన్లకు కూతవేటు దూరంలోనే తాళాల పగులకొట్టి చోరీలకు పాల్పడు తుండం గమనార్హం. ముసుగులు ధరించి అర్ధరాత్రి కాలనీలో దొంగలు తిరుగుతుండటం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బంగారం ధరలు పెరగ డంతో దొంగలు బంగారాన్ని టార్గెట్ చేసి రెచ్చిపోతున్నారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో నాలుగు ఇళ్లలో జరిగిన చోరీ ఘటనల వెనుక మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటికి తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి ఇళ్ల తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. ధరూర్‌లో అర్ధరాత్రి 2 గంటల నుంచి 3 గంటల వరకు చోరీకి పాల్పడి



ధరూర్‌లో చోరీపై విచారణ చేస్తున్న సీఐ సుధాకర్

పారిపోయిన దొంగల కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి మహారాష్ట్రలోని నాందెడ్ వెళ్లి గాలిస్తున్నారు. నలుగురు ముఠా సభ్యుల వివరాల కోసం సీసీ కెమెరాలు, వేలిముద్రలను పరిశీలిస్తున్నామని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు.

●ఇటీవల జరిగిన దొంగతనాలు

జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. సెప్టెంబరు 10న పొరండ్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు గొల్లపల్లి వెంకవ్వ మెడలోనుంచి 2 తులాల బంగారు పుస్తెలతాడును చైన్‌స్నాచర్లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మరువక ముందే వారం వ్యవధిలో సంగంపల్లిలో మరో చోరీ జరిగింది. నేరెళ్ల లచ్చవ్వ అనే వృద్ధురాలు ఒంటరిగా ఉండడాన్ని గమనించిన దొంగ నేరుగా ఇంట్లోకి వెళ్లాడు. లచ్చవ్వ మెడలో నుంచి తులంనర పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన జగిత్యాల రూరల్ పోలీసులు 24 గంటల్లోపే నిందితుడిని పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం

-సుధాకర్, జగిత్యాల రూరల్ సీఐ

దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవల చోరీలకు పాల్పడ్డ వారి కోసం గాలింపు చేపట్టాం. కొత్త వ్యక్తులు కావడంతో వెంటనే సీసీ కెమెరాల ద్వారా వీరి ఆచూకీ లభించడంలేదు. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం. ప్రజలు ఊరికి వెళితే బంగారం, నగదు బ్యాంకుల్లో పెట్టాలి. వేరే గ్రామాలకు వెళ్లినప్పుడు పొరుగింటి వాళ్లకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలి

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటలో గురువారం నిర్వహించిన పశువుల గాలికుంటు వ్యాధి నివారణ శిబిరంను వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్ పరిశీలించారు. టీకాలు పకడ్బందీగా వేసి రైతులకు గ్రామాల్లో ఈ టీకాలు ప్రాధాన్యం వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి దివ్యశ్రీ, సిబ్బంది ఉన్నారు.

●వెల్గటూర్: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు ఇప్పించాలని మండల పశు వైద్యాధికారిణి శ్రీప్రియ సూచించారు. గురువారం మండలం లోని వెంకటాపూర్‌లో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటాపూర్‌లో 69 ఆవులు, ఎడ్లు, 92 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్లకూరి తిరుపతి, కోటయ్య, కుమార్, రవి, శ్రీనివాస్, సత్తయ్య, భూమయ్య, చంద్రయ్య, చిన్నయ్య, పశు వైద్య సిబ్బంది సంధ్య, నాగరాజు, నారాయణ, రాంకుమార్, చంద్రయ్య, అంజి పాల్గొన్నారు.

●భీమారం: మండలంలోని గోవిందారం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ నరేష్ మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకుని పశు సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 132 గేదెలు, 42 ఆవులకు పశు వైద్యాధికారి వెన్నెల టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర దేవయ్య, రిటైర్డ్ జేఏవో మురళి, గంగాధర్ పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

గొల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భూభారతి ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజలిచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఎంత మేరకు వచ్చిందో సంబంధిత రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం రికార్డులను, రిజిష్టర్‌లోను తనిఖీ చేశారు. భూసమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ ధృవీకరణ పత్రాల కోసం చేసుకున్న మీసేవా దరఖాస్తులను పెండింగ్ లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ధృవీకరణ పత్రాల పంపిణీలో ఎలాంటి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జాప్యం సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు, రెవెన్యూ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ, భూసమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మాజీద్, డీటీ సుమన్, ఆర్ఐలు జీవన్, అనూష, జూనియర్ అసిస్టెంట్ పెద్ది రమేష్, రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రాయికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ వార్డులో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతి గౌడ్‌కు 11వ వార్డు ప్రజలు వినతి పత్రం సమర్పించారు. వార్డులో త్రాగునీటి పైపులైన్ లేకపోవడంతో చాలాకాలంగా నీటి కోసం బోరు బావిపై ఆధారపడుతున్నామని, ఇప్పుడు బోరుబావి కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానాలకు, ఇతర అవసరాలకు నీరు లేని పరిస్థితి ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రజిత, కళావతి, శ్రీనివాస్, రాజు, మ్యాకల రమేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పరిశీలన

బీర్‌పూర్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని ఆయా గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవణాలను, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను గురువారం ఎంపీడీవో భీమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాతీ నిర్మాణాలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వాసవి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ అర్థశాస్త్రం పోస్ట్ భర్తీ చేయడానికి అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 సాయంత్రం లోపు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించు కోవాలన్నారు. పీజీ కలిగి బీఈడి పాసై ఉండాలని అన్నారు. ఈ నెల 18న డెమో క్లాసులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఖాళీలు భర్తీ చేసేదెన్నడో..?

(3వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయురాలు హైదరాబాద్‌లోని కమిషనరేట్‌లో డిప్యూటేషన్‌లో పనిచేస్తున్నారు. వసతిగృహాల్లో సైతం పలు ఖాళీలున్నాయి. పోస్టులు భర్తీ కాకపోవడం, ఉన్న పోస్టులు ఖాళీగా ఉన్న వ్యవహారాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారుల దృష్టికి పలు పర్యాయాలు తీసుకవెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి ఖాళీలు భర్తీ చేయాలని, కొత్త పోస్టులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

-రాజ్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ అధికారి



జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో పలు పోస్టులు ఖాళీగా ఉండడం, పలువురు ఇతర ప్రాంతాల్లో డిప్యూటేషన్‌లో పనిచేస్తుండడం, కొత్త పోస్టులు మంజూరు కాకపోవడం వంటి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాం. పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పలు ఇబ్బందులు తలెత్తు తున్నాయి. అయినప్పటికీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

-డీఆర్డీవో రఘువరన్



మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరణ్

పెగడపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీఆర్డీవో రఘువరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో పెగడపల్లి, మల్యాల, గొల్లపల్లి, మండలాల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వంచారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ తూకం వేసిన 24నుండి 48గంటలలోపు ఓపీఎంఎస్‌లో రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. కేటాయించిన మిల్లులకు ధాన్యం తరలించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములుగౌడ్, అడిషనల్ డీఆర్డీవో పి. సునీత, డీపీఎం డి. నారాయణ, సమాఖ్య అధ్యక్షురాలు రూపకల, ఏపీఎంలు పాల్గొన్నారు.

రేవా జిల్లా కమిటీ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) జగిత్యాల జిల్లా శాఖ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షులుగా అయిల్నేని నరేందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నం రాంరెడ్డిలు ఎంపికయినట్లు తెలిపారు. కోశాధికారిగా మామిడాల లక్ష్మి నారాయణ, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, నసీం అహ్మద్, కటకం ప్రభు, బుర్ర గంగాధర్‌లు ఎన్నికయ్యారు. కాగా ఎన్నికల అధికారిగా కోహెడ చంద్రమౌళి, ఎన్నికల పరిశీలకులుగా గద్దె జగదీశ్వర చారిలు వ్యవహరించారు. ఏకగ్రీవంగా రేవా జగిత్యాల కమిటీని ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రైవేటు ఆసుపత్రిలో వ్యక్తి మృతిపై విచారణ

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వ్యక్తి మృతి ఘటనపై గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో నీలారపు శ్రీనివాస్ విచారణ జరిపారు. రాయికల్ పట్టణానికి చెందిన బైరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఆగస్టు 23న జగిత్యాలలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో హృదయ సంబంధ వ్యాధితో చికిత్స తీసుకుంటూ మృతి చెందాడు. దీనికి సంబంధించి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓను ఎంక్వైరీ ఆఫీసర్‌గా నియమించగా స్థానిక మోతే వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈ విచారణ సందర్భంగా ఆరోగ్య శ్రీ తరపున డిస్ట్రిక్ కోఆర్డినేటర్, ప్రయివేటు హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది హాజరయ్యారు. కార్డియాలజీ నిపుణులు అనివార్య కారణాలవల్ల విచారణకు హాజరు కాలేదని తెలిపారు. వారిని విచారించి నివేదికను జిల్లా వైద్యాధికారికి సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ సురేష్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సహకార శాఖ ఎన్జీవోల జిల్లా కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ జగిత్యాల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవో జిల్లా కార్యదర్శి ఊకంటి అమరేందర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎండీ నిజాముద్దీన్, కార్యదర్శిగా చైతన్య, కోశాధికారిగా అభిషేక్, ఉపాధ్యక్షులుగా స్వప్న, అబ్దుల్ ఖలీం, వేణుమాధవ్, సభ్యులుగా వెంకటసాయిరెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేస్తూ జిల్లా సహకార శాఖను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కోశాధికారి సాహెద్‌బాబు, సూపరిండెంట్ అసద్, రాము, అబ్దుల్ సలాం, రాజేశ్వరీ, సాయి కిరణ్ తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగ రావు రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి, ఇంటలిజెన్స్ చీఫ్ విజయ్ కుమర్‌లను గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థిని ఎంపిక

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో నిర్వహించిన మండల స్థాయి కేజీఎఫ్ క్రీడలలో గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థిని వెన్య పటేల్ జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థిని వెన్య పటేల్‌ను అధ్యాపకులు, ఇతరులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అరుంధతి మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు లాంటివి తప్పకుండా ఉండాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు మైదానాల్లో ఆడుకున్నప్పుడే వారిలో మానసిక, భౌతిక వికాసం జరుగుతుందని అన్నారు. అదే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థిని విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీక్, హేమలత, సృజన పలువురు విద్యార్థులను అభినందించారు

వరి పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

సారంగాపూర్, అక్టోబరు, 16 (ఆంధ్రజ్యోతి) : మండంలోని బట్టపెల్లి గ్రామానికి చెందిన రైతు మారం సతీష్ వరి పంటను అడవి పందులు బుధవారం రాత్రి ధ్వంసం చేశాయి. దీంతో పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంబంధిత శాఖ అధికారులు పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి'



జగిత్యాలలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

జగిత్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 9 షెడ్యూల్‌లో పొందుపరిచి బిల్లును ఆమోదించాలని జగిత్యాల బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు బీసీ జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈనెల 18వ తేదీన ఇచ్చిన బంద్ పిలుపును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జగిత్యాల బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

●కోరుట్ల: ఈ నెల 18న నిర్వహించి బీసీ రాష్ట్ర బందు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలికి విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని ఎస్ఎస్‌కే భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు వివిధ పార్టీల నాయకులు చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, విజయ్, మమత, సుతారి రాముల, రాజేశం, శికారి గోపికృష్ణ, రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

●బీసీ రాజర్వేషన్ల అమలుపై పోరాటంకు సిద్ధం కావాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమక్రసీ జిల్లా నాయకులు చింత భూమేశ్వర్ అన్నారు. గురువారం వామపక్షాల సమావేశం ఏర్పాటు చేసి బంద్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకలు గంగాధర్, గాజెంకి రాజేశం, రణాప్రతాప్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●ధర్మపురి: రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జాజాల రమేష్ తెలిపారు. ధర్మపురి మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు స్తంభంకాడి శ్యాంసుందర్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ నేతలు వేముల సురేష్, అనుమల్ల రాయమల్లు, బోరె మల్లేశం, బైరం శ్రీనివాస్, అంబటిపెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓరగంటి భార్గవ రామ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షులు మానాల కిషన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, జిల్లా రజక సంఘం అధ్యక్షులు నారాయణ హాజరయ్యారు. మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఏసీడీపీవో అరవింద

గొల్లపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పండ్లు, పాలు, ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సీడీపీవో వీరాలక్ష్మీ అన్నారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలో మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమంను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా సీడీపీవో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సీడీపీవో జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు అన్నప్రాశణ, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, తక్కువ ఖర్చుతో అధికంగా ఉండే పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలు ప్రతి రోజు ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఇండ్ల ఆవరణలో న్యూట్రి గార్డెన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పవిత్ర, సూపర్‌వైజర్లు మామిడాల జ్యోతి, జానకి, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు తాండ్ర రమాదేవి, చెన్నాడి హరిప్రియ పాల్గొన్నారు.

●కొడిమ్యాల: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్ట్ ఏసీడీపీవో అరవింద అన్నారు. గురువారం మండలంలోని సంద్రల్లపల్లి కస్తూరాబా బాలిక విద్యాలయంలో పోషణ అభియాన్ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు జంక్ ఫుడ్, పోషకాహారం అనిమియా గురించి పలు అంశాలను తెలిపారు. రక్తహీనత గురించి వివరించారు. పోషకాహారంపై విద్యార్థులకు పరీక్షలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు నరేష్, పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ వెంకటనర్సమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ, ఏఎస్‌వో లావణ్య, కార్యదర్శి నవీన్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న డీపీవో మదన్‌మోహన్

రాయికల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని డీపీవో మదన్‌మోహన్ అన్నారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సోషల్ ఆడిట్, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి పన్ను వసూళ్లపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, విజిలెన్స్ అధికారి దేవేందర్, ఎంపీవో సుష్మా, ఏపీవో దివ్య, ఏఈ హౌసింగ్ తిరుమల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాల వేళలో బస్సు నడపాలని ధర్నా

భీమారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పాఠశాల విద్యార్థులు ఆర్టీసీ బస్సు సమయానికి రాకుండా ఆలస్యంగా వస్తుందని గురువారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ప్రతి రోజు బస్సు సమయానికి రాకపోవడంతో పాఠశాలకు ఆలస్యమవుతుందని, తరగతులకు హాజరు కావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కథలాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను గురువారం నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. తాండ్ర్యాల, చింతకుంట, దుంపెట, కథలాపూర్, గంభీర్‌పూర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వెలిబుచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గడ్డం భూమారెడ్డి, మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, మామిడిపల్లి రవి, ప్రతాప్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మస్కూరి కిరణ్, రఫీ, రామాంజనేయులు, లింబాద్రి, కిరణ్‌రావు తదితరులు ఉన్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

కోరుట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయ హుండీ లెక్కింపు గురువారం దేవాలయ దర్మధాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయ దర్మధయ శాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమోగిలి పర్యవేక్షణలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ ఎతిరాజం నర్సయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 1,05,267 సమకూరినట్లు ఈఓ విక్రమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు నేతి శ్రీనివాస్, కటకం దివాకర్, గొడికె రాములు, కోట గంగాధర్, చిలివేరి విజయ్ కుమార్, పద్మ పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర దేవాలయ హుండి లెక్కింపు గురువారం దేవాలయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమోగిలి పర్యవేక్షణలో నిర్వహించారు. హుండి ఆదాయం రూ.54,739 సమకూరినట్లు దేవాలయ ఈఓ విక్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ కటకం రాజేశం, సభ్యులు వెంకటరమణ, విఠల్ రవీందర్ రెడ్డి, బాజోజి రవీందర్, సిబ్బంది నర్సయ్య, రాజేందర్, కేశవ్, గంగాధర్‌లు పాల్గొన్నారు.